క్లుప్తంగా

ఇంటికి వెళ్లి.. పింఛన్ అందజేసి..



మహాలక్ష్మికి పింఛన్ అందజేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ రాము

జి.సిగడాం: టీడీపీ నాయకుల తీరు కారణంగా వలంటీర్ల సేవలకు అంతరాయం కలిగింది. దీంతో పింఛన్ల పంపిణీలో జాప్యం నెలకుంది. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు సచివాలయ సిబ్బంది వృద్ధుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందజేస్తున్నారు. మండల కేంద్రమైన జి.సిగడాం పట్టణానికి చెందిన 90 ఏళ్ల వృద్ధురాలు దుర్గాశి మహాలక్ష్మి మంచానికే పరిమితమైంది. దీంతో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ పొగిరి రాము ఆమె ఇంటికి శుక్రవారం వెళ్లి పింఛన్ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తమ వలంటీర్ గురించి వృద్ధురాలు ఆరా తీసింది.

రామ మందిరానికి వెండి విరాళం



వెండి అందజేస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లిలోని వెలమ వీధిలో ఉన్న రామమందిరానికి సూరి సత్యనారాయణ దంపతులు పావు కేజీ వెండిని విరాళంగా శుక్రవారం ఆందించారు. కార్యక్రమంలో మందిర ప్రతినిధులు శీర చిన్నారావు, ఉంగటి అసిరినాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్

శ్రీకాకుళం రూరల్: ఐటీ ఒలింపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో ఫలితాల్లో సింగుపురంలోని క్రాంతి విద్యానికేతన్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. 8వ తరగతి చదువుతున్న పి.హేమ సుందర్ రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంక్, 6వ తరగతి విద్యార్థి వై.ద్రోణ జోనల్ విభాగంలో 3వ ర్యాంక్ సాధించారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ గుండ అమ్మడు శుక్రవారం అభినందించారు.

ఘనంగా దాసాంజనేయ ఆలయ పునఃప్రతిష్టాపన



పూజలందుకుంటున్న స్వామివారు

గార: మండలంలోని కె.మత్స్యలేశం (పోర్టు కళింగపట్నం) పంచాయతీ చిన్న మత్స్యలేశంలో దాసాంజనేయస్వామి ఆలయ పునఃప్రతిష్టాపన మహోత్సవం శుక్రవారం కనులపండువగా జరిగింది. కెప్టెన్ మైలపిల్లి జనార్దన్ సోదరులు, గ్రామస్తులు విశేష పూజల్లో పాల్గొన్నారు. అరసవల్లి సూర్యదేవాలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ప్రతిష్టాపనోత్సవం జరిగింది. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్ : ప్రతి ఒక్కరిలో సేవాగుణం ఉండాలని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్ అన్నారు. శుక్రవారం నగరంలోని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ కార్యాలయ ఆవరణలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ లయన్స్‌క్లబ్ ముందుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ సేవా భావంతో పేదలకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తే సమాజం మరింత మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్‌పర్సన్ డాక్టర్ బాడాన దేవభూషణరావు, సెక్రటరీ టిక్కం రాంగోపాల్, ట్రెజరర్ శిల్లా మణి, సభ్యులు కామేష్, సీనియర్ సభ్యులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, అంధవరపు ప్రసాద్, బరాటం లక్ష్మణరావు, ఊన్న కిరణ్, లావేటి లక్ష్మణరావు, జోగి భారతి, తేజ స్వామి పాల్గొన్నారు.

జగ్జీవన్‌రాం ఆదర్శప్రాయుడు



ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ఆర్‌జీయూకేటీ క్యాంపస్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డైరెక్టర్ ఆర్‌వీజీడీ బాలాజీ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): డాక్టర్ బాబూ జగ్జీవన్‌రాం దళితుల ఆశాజ్యోతి అని సామాజిక న్యాయపోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లేపల్లి రాంగోపాల్, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క కృష్ణయ్య, డి.గణేష్ అన్నారు. జగ్జీవన్‌రామ్ 116వ జయంతి సందర్భంగా శ్రీకాకుళం నగరంలోని మిల్లు జంక్షన్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవంలో మతోన్మాద శక్తిని ఓడించమే జగ్జీవన్‌రాంకు నిజమైన నివాళని పేర్కొన్నారు. దళితుల హక్కులు, అభివృద్ధి అహర్నిశలకు కృషి చేసిన మహానుభావుడని కొనియాడారు.



ఎచ్చెర్ల క్యాంపస్: బీఆర్‌ఏయూలో జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో వీసీ జి.ఆర్.రజిని

శ్రీకాకుళం అర్బన్: బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవనరాం అందరికీ ఆదర్శప్రాయుడని శ్రీకాకుళం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పైడి నాగభూషణరావు అన్నారు. జగ్జీవనరాం జయంతి సందర్భంగా శ్రీకాకుళం ఇందిరావిజ్ఞానభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డి.గోవిందమల్లిబాబు, మంత్రి నరసింహమూర్తి, రమేష్‌నాయుడు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

గార: జగ్జీవన్ రాంను స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. అంపోలు ఎస్సీ కాలనీలో శుక్రవారం జగ్జీవన్‌రాం జయంతి నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాణా శ్రీనివాసరావు మాదిగ, లోపింటి తేజేశ్వరరావు, నత్తల రవి, గోవిందరావు, కంటిపాక చిట్టయ్య, కురమాన అసిరయ్య, అప్పన్న, మురపాక సన్యాసిరావులు పాల్గొన్ని జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బలహీన, బడుగు, బీసీ వర్గాల అభ్యున్నతికి పాటుపడిన వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘనంగా నివాళి

ఎచ్చెర్ల క్యాంపస్: మాజీ ఉప రాష్ట్రపతి బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శ్రీకాకుళం రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎం పురం క్యాంపస్‌లో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయాల్లో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు.



గార: జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద నివాళులర్పించిన ఎమ్మార్పీఎస్ నాయకులు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘ నాయకులు



శ్రీకాకుళం అర్బన్: జగ్జీవన్‌రాం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కలిసికట్టుగా పనిచేద్దాం



నాయకులతో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

• ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: సమిష్టి కృషితోనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో విజయం సాధించి, అధికారంలోకి వస్తోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే అభ్యర్థి గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. కేశవరావుపేట సర్పంచ్ పైడి భాస్కరరావు ఇంటికి శుక్రవారం వెళ్లి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. సర్పంచ్ కుటుంబ సభ్యులు బొట్టుపెట్టి ఎమ్మెల్యేను ఇంటికి ఆహ్వానించి పార్టీ విజయానికి పరిపూర్ణంగా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతిపక్షాలు ఎన్నికుట్రలు చేసినా వైఎస్సార్‌సీపీదే విజయమన్నారు. పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నాయకులు బోర సాయిరాంరెడ్డి, పైడి నర్సింగరావు, బోర గోవింద రెడ్డి ఉన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



జి.సిగడాం: గెద్దకంచరాం గ్రామస్తులతో మాట్లాడుతున్న మధుసుదనరావు

జి.సిగడాం: ప్రశాంత ఎన్నికలకు ప్రజలు సహకరించాలని ఎస్సై వై.మధుసుదనరావు అన్నారు. గ్రామాలలో శాంతి భద్రతలకు భంగం కలిగించినా, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినా అటువంటి వారిపై నిఘా వేసి కేసులు నమోదు చేయడం తప్పదని హెచ్చరించారు. శుక్రవారం రాత్రి గెద్దకంచరాం గ్రామంలో నాయకులు, గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా గ్రామాల్లోని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుజాగ్రత్తగా సీసీ కెమెరాలు, వీడియోలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఇప్పటికే ఇరువర్గాల నుంచి బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఓట్ల కోసం ప్రజలను మభ్యపెట్టి ప్రలోభాలకు గురిచేస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

వైఎస్సార్ సీపీనే గెలిపించండి



ఇంటింటా ప్రచారంలో యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు



ఎల్‌బీఎస్ కాలనీలో ఇంటింటా ప్రచారంలో ధర్మాన సుశ్రీ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేయాలని వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లాతోపాటు నగరం అభివృద్ధి జరగాలంటే రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావుని గెలిపించాలని కోరారు. శ్రీకాకుళం నగరంలోని ఇలిసిపురంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్యకర్తలు వానపల్లి రమేష్, బుంగ గంగాధర్, కోటిపల్లి మోహన్‌రావు, ఎండ రమేష్, అల్లు లక్ష్మినారాయణ, అప్పలచారి, శ్రీనివాస్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌బీఎస్ కాలనీలో ఇంటింటా ప్రచార కార్యక్రమంలో ధర్మాన సుశ్రీ పాల్గొని పేదల ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.

సీవీ రామన్ టెస్ట్‌లో విద్యార్థిని ప్రతిభ



అవార్డు అందుకుంటున్న కుసుమప్రియ

శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం కల్చరల్: సుచిరిండియా సంస్థ తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించిన సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డుల ప్రతిభా పరీక్షలో శ్రీకాకుళం చినమండలవీధి రవీంద్రభారతి పాఠశాలకు చెందిన ఎ.కుసుమ ప్రియ ప్రతిభ కనబర్చింది. 7వ తరగతి చదువుతున్న ఈమె జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్ ఘోరచంద్ పల్క, సిబ్బంది అభినందించారు.

మహిళలకు స్వయం ఉపాధిపై శిక్షణ



మాట్లాడుతున్న వరప్రసాద్

రణస్థలం: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించే ప్రక్రియలో భాగంగా చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీపై శిక్షణ ఇస్తున్నామని నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి కుప్పిలి వరప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని ఓప్లేటు కల్యాణ మండపంలో ఏపీ నాబార్డు వ్యవసాయ గ్రామీణాభివృద్ధి వారి ఆర్థిక సహకారంతో యూత్ క్లబ్ బెజ్జిపురం ఆధ్వర్యంలో రణస్థలం, లావేరు మండలాలకు చెందిన 60 మంది స్వయం శక్తి సంఘాలకు చెందిన మహిళలకు 20 రోజుల చొప్పున చిరుధాన్యాలతో ఆహర పదార్థాల తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణ విజయవంతం చేసిన మహిళలకు అవసరమైన పెట్టుబడి నిమిత్తం స్థానిక బ్యాంకులకు అనుసంధానం చేస్తామన్నారు. అలాగే వారు తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ చేసుకునేందుకు రూరల్ మార్ట్ ఏర్పాటుకు నాబార్డు ద్వారా కృషి చేస్తామన్నారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. సమావేశంలో యూత్ క్లబ్ అధ్యక్షులు మేడూరి ప్రసాదరావు, డీసీసీబీ సూపర్‌వైజర్ పోలినాయుడు, యూత్ క్లబ్ కోశాధికారి గంట్యాడ అప్పలనాయుడు, అడ్వయిజరీ బోర్డు మెంబర్ మేడూరి శేషగిరిరావు ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండల కేంద్రం జి.సిగడాం ప్రధాన రహదారిలో చలివేంద్రాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి తుల సీప్రసాద్‌సాహు, వీఆర్వో భూపతి నర్సింగరావు ప్రారంభించారు. ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు దాహం తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జి.సిగడాం సచివాలయం డిజటల్ అసిస్టెంట్ పొగిరి రాము ఉన్నారు.

సి-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ గణేష్

శ్రీకాకుళం క్రైమ్ : ఎన్నికల్లో ఎటువంటి అక్రమాలు జరిగినా సి-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చని శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ బలివాడ గణేష్ అన్నారు. శుక్రవారం హయాతినగరంలో సిబ్బందితో కలిసి ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు ఎటువంటి తగాదాలు పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. కొంతమంది కుటుంబాలను భయపెట్టి ఓట్లుగా మలుచుకునేందుకు ఎత్తుగడలు వేస్తారని, అలాంటి వారికి భయపడొద్దని, ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. సి-విజిల్ యాప్ మాత్రమే కాకుండా డయల్ 100, వ్యక్తిగత నెంబరు 6309990842కు ఫోన్‌చేసి కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

శాంతియుత ఎన్నికలే లక్ష్యం



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సన్యాసినాయుడు

గార: సార్వత్రిక ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని శ్రీకాకుళం ఒకటో పట్టణ సీఐ ఎల్.సన్యాసినాయుడు అన్నారు. శుక్రవారం కె.సైరిగాం గ్రామంలో యువత, మహిళలు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భండా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఎటువంటి గొడవలు పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ ప్రభుత్వ అధికారుల బాధ్యతని, ఎటువంటి ప్రలోభాలకు ఓటర్లు గురికావద్దని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ కె.కృష్ణప్రసాద్, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా



రణస్థలం: పాతర్లపల్లిలో రాజీనామా చేసిన వలంటీర్లు



ఎచ్చెర్ల: రాజీనామా పత్రాలతో వెంకటాపురం వలంటీర్లు

రణస్థలం: రాజకీయాలకు అతీతంగా పనిచేస్తున్న వలంటీర్లపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న అడ్డగోలు విమర్శలకు మానసికంగా ఇబ్బందిపడి మూకుమ్మడి రాజీనామాలు చేస్తున్నామని పాతర్లపల్లి వలంటీర్లు తెలిపారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ స్వగ్రామం పాతర్లపల్లికి చెందిన 26 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ.. ప్రజా క్షేత్రంలో క్రియాశీలకంగా పనిచేసి మరోసారి కిరణ్‌కుమార్‌ను గెలిపించుకుంటామన్నారు. 2019లో సీఎం జగన్ ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ సంక్షేమ పాలనకు ప్రతీగా నిలిచిందని, అవ్వాతాతలకు వలంటీర్ల వలన ఎంతో మేలు జరిగిందన్నారు. అటువంటి తమను చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు కుట్రలు పన్ని తప్పించడానికి నిరసనగా రాజీనామానాలు చేస్తున్నట్టు వెల్లడించారు.

ఎచ్చెర్ల: లావేరు మండలం వెంకటాపురం సచివాలయం పరిధిలోని 11 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ.. ప్రజలకు మరింత చేరువై.. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌ను గెలిపించుకుంటామన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ ప్యాకెట్లను అందజేస్తున్న సీఐ అవతారం

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని ఏడు రోడ్ల కూడలిలో విజయదుర్గ అమ్మవారి ఆలయ అర్చక బృందం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ట్రాఫిక్ సీఐ అవతారం శుక్రవారం ప్రారంభించారు. ఎండ తీవ్రత పెరిగిన నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. పలువురికి మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు.

గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్



ఎస్ఎంపురంలో ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పోలీసులు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జేఆర్‌పురం సీఐ జి.రామచంద్రరావు కోరారు. ఎస్ఎంపురం, కేశవరావుపేట, ఎచ్చెర్ల గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో ర్యాలీ చేసి నిర్భయంగా ఓటు వేయాలని ప్రజలకు సూచించారు. ఎచ్చెర్ల ఎస్సై చిరంజీవి, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

కొలతలపై అవగాహన

ఎచ్చెర్ల క్యాంపస్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చినరావుపల్లిలో జరుగుతున్నాయి. ఇందులో భాగంగా పనుల కొలతలపై మేట్లకు సాంకేతిక సహాయకులు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. వేసవి నేపథ్యంలో ఉదయం, సాయంత్రం పనులు నిర్వహించాలని, ముందుగానే పనులపై వేతనదారులకు సూచనలు చేయాలని సాంకేతిక సహాయకులు మణికంఠతో కూడిన బృందం సూచించింది.

విత్తనాల పంపిణీ



పాలఖండ్యాంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

జి.సిగడాం: పాలఖండ్యాం, సంతవురిటి, మెట్టవలస సీతారాంపురం, గేదెలపేట, ఆనందపురం గ్రామాల రైతులకు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు ఆధ్వర్యంలో విత్తనాలను శుక్రవారం పంపిణీ చేశారు. పాలఖండ్యాం గ్రామ సర్పంచ్ ధారబోయిన రెయిమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ధర్మారాజ్‌సమక్షంలో పెసర, మినము, నువ్వు విత్తనాలను అందజేశారు. రబీలో పండించిన మొక్కజొన్న పంట అనంతరం పొలాలను ఖాళీగా ఉంచకూడదన్నారు. వేసవిలో అరుతడి పంటలు వేసుకుంటే భూగర్భజలాలు ఆవిరైపోకుండా కాపాడుకోవచ్చునని చెప్పారు. వేసవిలో తప్పనిసరిగా ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలన్నారు. రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త దేబారికి సూర్యనారాయణ, వెంకటఅప్పారావు, రంగారావు, శ్రీనివాసరావు ఉన్నారు.

సంక్షిప్తంగా..

ముమ్మరంగా వాహనాల తనిఖీ



శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని ముఖ్య కూడళ్లలో శుక్రవారం రాత్రి సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో రెండో పట్టణ పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. విశాఖ నుంచి నగరంలోకి ప్రవేశించే సింహద్వారం, బలగ, రామలక్ష్మణ కూడళ్లలో కార్లు, వ్యాన్లు, ద్విచక్రవాహనాలను తనిఖీ చేశారు.

ఓటు హక్కుపై అవగాహన

ఎచ్చెర్ల: ఓటు హక్కును ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలని వెలుగు ఏపీఎం రామ్మూర్తి అన్నారు. పొన్నాడ గ్రామంలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్‌హెచ్‌జీ సంఘాల మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఉపాధి' లక్ష్యాలు సాధించాలి

జి.సిగడాం: జాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకం పనుల లక్ష్యాలను సాధించాలని ఎచ్చెర్ల క్లస్టర్ ఏపీడీ కె.లోకేష్ అన్నారు. సీఆర్డీ అధికారుల ఆదేశాల మేరకు ఆనందపురం గ్రామంలో వేతనదారుల సమక్షంలో కొత్త పనులను గుర్తించడానికి శుక్రవారం గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జాబ్ కార్డు ఉన్నవారందరికీ పనులు కల్పించేందుకు వీలు కొత్త పనులు గుర్తించాలన్నారు. ఏపీవో చోళ్ల సత్యన్నారాయణ, పొందూరు, జి.సిగడాం, ఆమదాలవలస మండలాలకు చెందిన ఈసీలు గేదెల పురుషోత్తంనాయుడు, సందీప్, రాము, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఎఫ్ఏలు ఉన్నారు.

బాలా త్రిపుర సుందరీదేవికి అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని బాలా త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు చేశారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ నేతృత్వంలో అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విజయదుర్గకు విశేష పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నానుబాలవీధిలో విజయదుర్గా దేవి ఆలయంలో ఫాల్గుణమాస శుక్రవారం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, కుంకుమార్చనలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: కుంచాలకుర్మయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో శుక్రవారం పలు ప్రత్యేక పూజలు జరిగాయి. ఇక్కడ ఉన్న రాజరాజేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేశారు. పీఠాధిపతి బాల భాస్కరశర్మ ఆధ్వర్యంలో శ్రీచక్రాలకు, మహామేరువుకు కుంకుమార్చనలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.